# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 20-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతీయ ప్రాచీన భాషలు, సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన భాద్యత మనందరిపై ఉందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ అన్నారు.
- ❖ జూనియర్ వైద్యురాలి హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్ కు కోల్ కతాలోని సీల్డా కోర్టు ఈరోజు జీవిత ఖైదు శిక్షను విధించింది.
- ❖ ఉత్తరాఖండ్ రాష్ట్ర మంత్రివర్గం ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)కి ఆమోదం తెలిపింది.
- ❖ యువత దేశ నిర్మాణానికి, శ్రేయస్సుకు దోహదం చేస్తారని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతీయ ప్రాచీన భాషలు, సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన భాద్యత మనందరిపై ఉందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ అన్నారు. న్యూఢిల్లీలోని భారత విద్యాభవన్‌లోని నందలాల్ నువాల్ సెంటర్ ఆఫ్ ఇండాలజీ శంకుస్థాపన కార్యక్రమంలో ఈరోజు ఆయన పాల్గొని ప్రసంగించారు. భారతదేశం ఎల్లప్పుడూ శాంతి, సామరస్యం కోసం కృషి చేస్తుందని పునరుద్ఘాటించారు. దేశ సంస్కృతి, వారసత్వం పట్ల యువత గర్వపడాలని సాంస్కృతిక పునరుజ్జీవనానికి కృషి చేయాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కోల్ కతాలోని ఆర్ జికర్ వైద్య కళాశాలకు చెందిన జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసులో సంజయ్ రాయ్ కు సీల్డా కోర్టు ఈరోజు జీవిత ఖైదు శిక్షను విధించింది. అలాగే బాధిత కుటుంబానికి 17 లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దర్యాప్తు సంస్థ సిబిఐ సమర్పించిన ఆధారాలు ఈ సంఘటనలో సంజయ్ రాయ్ దోషి అని రుజువు చేస్తున్నాయని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ తెలిపారు. కాగా 2024 ఆగస్టు

10న కోల్ కతా పోలీసులు సంజయ్ రాయ్ ను అరెస్టు చేశారు. తరువాత ఈ కేసును సిబిఐకి అప్పగించడంతో సంజయ్ రాయ్ పై సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ రాష్ట్ర మంత్రివర్గం ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) మాన్యువల్‌కు ఆమోదం తెలిపింది. దీంతో ఉత్తరాఖండ్ లో యూసీసీ అమలుకు మార్గం సుగమం అవుతుందని ఈ నిర్ణయం సామాజిక సంస్కరణల పట్ల తమ రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని ప్రతిభింబిస్తుందని ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పేర్కొన్నారు. భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలకు ఉత్తరాఖండ్ ప్రేరణగా నిలుస్తుందని ఆయన మాట్లాడుతూ.....

(వాయిస్ 21 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

యువత దేశ నిర్మాణానికి, శ్రేయస్సుకు దోహదం చేస్తారని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన ఎన్.సి.సి. రిపబ్లిక్ డే క్యాంప్ 2025లో రాజ్ నాథ్ సింగ్ ప్రసంగిస్తూ.. భారత సంస్కృతి 140 కోట్ల మంది ప్రజల ఐక్యతతో ముడిపడి ఉందని ప్రతీ వ్యక్తి అభివృద్ధి సమాజ అభివృద్ధిని ప్రతిభింబిస్తుందని అన్నారు. క్రమశిక్షణ, ఐక్యత, సమగ్రతను సాధించడంలో ఎన్.సి.సి. సహాయపడుతుందని రాజ్‌నాథ్ సింగ్ ఎన్.సి.సి. కాడెట్స్ ను ఉద్దేసించి మాట్లాడుతూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్థిక సంస్కరణల వల్ల అధిక పెట్టుబడులు రావడంతో భారతదేశ జిడిపి వృద్ధి 7 నుండి 8 శాతం ఉండే అవకాశం ఉందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అధ్యక్షులు బోర్జ్ బ్రెండే పేర్కొన్నారు. 55వ వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశం సందర్భంగా ఈరోజు ఆయన ఒక ఇంటర్వ్యూ లో మాట్లాడుతూ... భారతదేశానికి గొప్ప సామర్థ్యం ఉందని.. పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, పరిశోధన రంగాలలో సంస్కరణలు తీసుకువస్తే భారతదేశం మళ్లీ 7 నుండి 8 శాతం వృద్ధిని సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేసానికి హాజరయ్యేందుకు కేంద్ర సమాచార ప్రాసర శాఖ మంత్రి సారధ్యంలోని భారత బృందం దావోస్ చేరుకుంది. అలాగే ఈ సమావేశానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా హాజరు కానున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో గత 45 రోజుల్లో మూడు కుటుంబాలకు చెందిన 17 మంది అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడానికి గల కారణాలను తెలుసుకోవడానికి ఉన్నత స్థాయి మంత్రుల బృందం ఈరోజు బాధాల్ గ్రామాన్ని సందర్శించింది. స్థానిక అధికారులతో కలిసి ఈ బృందం తక్షణ ఉపశమనం అందించడానికి అలాగే భవిష్యత్‌లో జరిగే సంఘటనలను నివారించడానికి చర్యలు తీసుకుంటుంది. కాగా రాజౌరి జిల్లాలోని ఈ ప్రాంతంలో డిసెంబర్ 7 నుండి జనవరి 19 మధ్య మరణించిన సంఘటనలపై దర్యాప్తు చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కేంద్ర బృందాన్ని ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో లక్షలాది మంది భక్తులకు సురక్షితమైన ఆహారం లభ్యతను నిర్ధారించడానికి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI) పటిష్టమైన చర్యలను అమలు చేస్తోంది. ఫుడ్ సేఫ్టీ అధికారులను మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను నియమించడంతో పాటు అవగాహన కార్యక్రమాలను FSSAI నిర్వహిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కార్మిక బోర్డు త్వరలో స్వతంత్ర, తాత్కాలిక కార్మికులు, ఆన్ లైన్ వేదికల్లో పనిచేసే గిగ్ వర్కర్లను సామాజిక భద్రత పరిధిలోకి తీసుకువస్తుందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ప్రకటించారు. న్యూఢిల్లీలో అనధికారిక రంగంలోని కార్మికులకు సామాజిక భద్రత అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సెమినార్‌ను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఎటువంటి వివక్ష లేకుండా కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. సుమారు 60 కోట్ల మంది ప్రభుత్వ ఆరోగ్య భద్రతా పథకాల పరిధిలోకి వస్తున్నారని, 5 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య చికిత్స పొందుతున్నారని మన్సుఖ్ మాండవీయ తెలియజేస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా 47వ అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ మరికొద్ది గంటల్లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వాషింగ్టన్, డి.సి.లోని కాపిటల్ రోటుండాలో ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ ఆయంతో ప్రమాణం చేయిస్తారు. అంతకముందు నిన్న రాత్రి వాషింగ్టన్, డి.సి.లో జరిగిన విజయోత్సవ ర్యాలీలో ట్రంప్ ప్రసంగించారు. అమెరికా ఎదుర్కొంటున్న ప్రతి సంక్షోభాన్ని పరిష్కరించడానికి అతి వేగంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ కార్యక్రమంలో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ వేడుకకు అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే, ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోని సహా పలువురు విదేశీ నాయకులు హాజరుకానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ ఈరోజు వాషింగ్టన్ డిసిలో జపాన్ విదేశాంగ మంత్రి తకేషి ఇవాయాతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సహకారంలో పురోగతి, క్వాడ్ కూటమికి సంబంధించిన పరిణామాలపై చర్చించామని జైశంకర్ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = =